క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన ట్రైనీ కలెక్టర్లు



సత్యదేవుని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్లు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం లోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారిని ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు (2024 ఐఏఎస్ బ్యాచ్) గురువారం దర్శించి పూజలు నిర్వహించారు. వారికి ముఖద్వారం వద్ద పండితులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు, వేదాశీస్సులు స్వామివారి ప్రసాదాలను అందచేశారు. అనంతరం ఆలయ చరిత్రను వారికి వివరించారు. వారి వెంట విశ్రాంత ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

భవిష్యత్‌కు అంగన్‌వాడీలే పునాది



గెద్దనాపల్లి అంగన్‌వాడీలో చిన్నారులను సర్టిఫికెట్లతో సత్కరిస్తున్న సీడీపీఓ పూర్ణిమ

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి అంగన్‌వాడీ–5 కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం సెక్టర్ సూపర్‌వైజర్ బూసమ్మ అధ్యక్షతన, సీడీపీఓ ఎం.పూర్ణిమ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను వీడి ప్రాథమిక విద్యలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి సత్కరించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిగర్భంలో శిశువు ఉన్నప్పటి నుంచి 5 ఏళ్లు వచ్చే వరకు పోషక విలువలతో కూడిన ఆహారం తప్పనిసరన్నారు. బాల్యంలోనే వారి భవిష్యత్‌కు పునాదులు వేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. 3 ఏళ్లు నిండిన పిల్లలను స్థానిక అంగన్వాడీ కేంద్రాలలో చేర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. సర్పంచ్ సభ్యుడు మొల్లేటి గంగాధర్, సూరిశెట్టి వెంకట శివ, ఎంఎస్ హెచ్ఓ సరస్వతి, హెచ్.వీ మంగతాయారు, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

ఆచూకీ లేని పవనాలు..!



సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: రాష్ట్రంలో రుతుపవనాలు సమయానికి ముందే ప్రవేశించినా ప్రస్తుతం వర్షాలు కురవకా ముఖం చాటేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ముందస్తు సాగుకు రైతులంతా సిద్ధపడినా వర్షాభావ పరిస్థితుల్లో విత్తనాలు చల్లేందుకు రైతులు ఆలోచనలో పడ్డారు. కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ జలాశయంలో ప్రస్తుతం 366.8 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలు ఆయకట్టు అవసరాలకు 60 రోజుల పాటు సరిపోతాయని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి 355 అడుగుల నీటిమట్టం మాత్రమే ఉండేదని, ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ట నీటిమట్టం 340 అడుగులు. నీటి నిల్వలు 370 అడుగులకు చేరితే నీటి విడుదలకు అనుకూలం. కాకినాడ జిల్లాలో 20 వేల ఎకరాలకు కుడి, ఎడమ కాలువల ద్వారా తాండవ జలాశయం నుంచి సాగునీరు అందనుంది. ఈ నెలాఖరు నాటికి ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ, ఆయకట్టు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని డీఈఈ అనురాధ గురువారం తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తుని: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు కేఎస్ఎన్ మూర్తి అన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలో విద్యార్థులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు మూర్తి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి యోగాను తమ దినచర్యగాలో భాగంగా మార్చుకోవాలన్నారు. యోగా చేయడంతో మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. యోగాతో కలిగే ప్రయోజనాలు, ప్రాణాయామం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో వివిధ యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న వెయ్యి మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు

తెల్లబంగారానికి గడ్డుకాలం

- పెరిగిన పెట్టుబడులతో రైతన్న గగ్గోలు
- పతనమవుతున్న ధరలు
- దోచుకుంటున్న దళారులు



పత్తిలో అంతర పంటకు అనువుగా మలివిడత దుక్కు చేస్తున్న రైతు



చామవరంలో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

తుని రూరల్: మెట్ట రైతులు తెల్లబంగారంగా చెప్పుకునే పత్తిపంట సాగు పనులు జోరుగా ఊపందుకున్నాయి. తుని వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో పత్తి విత్తనాలు విత్తే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూన్ మొదట వారం నుంచి పత్తినాట్లు జరగాల్సి ఉన్నప్పటికి వాతావరణం అనుకూలించకపోవడం, ఇటీవల అధిక వర్షాలు కురవడంతో విత్తనాలు వేసే పనులు రైతులు ఆలస్యంగా మొదలు పెట్టారు. సబ్‌డివిజన్ పరిధిలో తుని, రౌతులపూడి, శంఖవరం, తొండంగి, కోటనందూరు మండలాల్లో సాగునీరు అందుబాటులో లేని రైతులు వర్షాధారంగా పత్తిని సాగు చేస్తున్నారు.

ఐదు మండలాల్లో పరిస్థితి ఇలా

ఐదు మండలాల్లో సాధారణ పత్తిసాగు 2,650 హెక్టార్లలో సాగవ్వగా గిట్టుబాటు ధరలు లేకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం, అధిక పెట్టుబడులతో గతేడాది సాధారణ సాగు 60 శాతానికి పడిపోయింది. తుని మండలంలో సాధారణ సాగు 680 హెక్టార్లకు గాను 330 హెక్టార్లలో సాగయ్యింది. ఇదే విధంగా కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రతి సంవత్సరం కొత్త ఆశలతో రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతూ పత్తి సాగు చేస్తున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే ఈ సంవత్సరం సాధారణ సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

పెరుగుతున్న పెట్టుబడులు

ప్రతి సంవత్సరం గిట్టుబాటు ధర లభించనప్పటికి పెట్టుబడులు పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి వసతులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పత్తి సాగు చేయాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు, విత్తనాలు నాటడం నుంచి కూలీలతో పత్తి సేకరణ, విక్రయానికి ఎకరాకు రూ.27వేల నుంచి రూ.30వేలు వరకు పెట్టుబడి అవుతుందని, కొనుగోలు కేంద్రాలు లేక దళారుల చేతిలో కష్టం నీలపాలవుతుందని రైతులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తేనే రైతు గట్టెక్కుతామని వాపోతున్నారు.

ముమ్మరంగా పనులు

సబ్‌డివిజన్‌లో వేసవి దుక్కులు చేసిన రైతులు కొద్దిరోజులుగా పత్తి విత్తనాలను విత్తుతున్నారు. ఎకరాకు 450 గ్రాముల బరువున్న రెండు ప్యాకెట్ల విత్తనాలను వరుస క్రమంలో రైతులు నాటుతున్నారు. మరి కొంతమంది రైతులు అంతర పంటలు సాగు చేసేందుకు మలివిడత దుక్కులు చేస్తూ ప్రత్యేక విధానంలో మడులు కడుతున్నారు. పత్తిలో అంతర పంటలుగా ఉల్లి, కంది, చేమదుంప, బంతిపూలు వంటి పంటలను వేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తిసాగు చేసే రైతులు మేలైన యాజమాన్యం, పంట మార్పిడి పద్ధతులు పాటించాలి. సకాలంలో వేసవి దుక్కులు చేయడంతో చీడపీడలు తగ్గుతాయి. మంచి హైబ్రిడ్ విత్తనాలను ఎంపిక చేసుకుని వరుసల మధ్య 90 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 60 సెంటీమీటర్లు ఉండేవిధంగా విత్తుకోవాలి. కలుపు, గులాబి రంగు పురుగులు, ఇతరేతర తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలతో మందులు పిచికారి చేసుకోవాలి. అధిక వర్షాలు కురిస్తే పొలంలో వరదనీరు నిలిచిపోకుండ ముందుగా కాలువలు ఏర్పాటు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను రైతులు తప్పనిసరిగా భద్రపర్చుకోవాలి. విత్తనాలు మొలకెత్తకపోయినా, నకిలీ విత్తనాలు వచ్చిన నష్ట పరిహారం డిమాండ్ చేసేందుకు అవకాశం ఉంటుంది.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని మండలం.

కాలువలను తవ్వించండి మహాప్రభో



కిర్లంపూడి ఇరిగేషన్ కార్యాలయంలో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కిర్లంపూడి: పంట కాలువలను తవ్వించండి మహా ప్రభో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ప్రారంభమైనా నేటికి మండలంలో ఎక్కడ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపు డెక్కతో పేరుకుపోయి సాగు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్, ఇరిగేషన్ ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్‌కు ఆయా కార్యాలయాల్లో గురువారం వినతి పత్రాలు అందజేశారు. కిర్లంపూడిలోని పెద్ద చేరీకి చెందిన పెద్దవీర్రాజు కాలువ, చిన్న వీర్రాజు కాలువ, సానవారి కాలువవలతో పాటు రాయిచెరువు, జల్లేరు, రాచెరువు, చెన్నచేరి కాలువ, పద్మనాభం కాలువలపై సుమారు వెయ్యి ఎకరాలు పంట సాగవతుందన్నారు. ఈ కాలువలన్ని మట్టితో పూడుకుపోయి, నీరు పారే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా రైతులే చందాలు వేసుకుని కాలువలను తవ్వించుకుంటున్నామన్నారు. ఇటీవల కాలంలో కాలువ గట్లను స్థానికులు ఆక్రమించుకోవడంతో జేసీబీ వెళ్లే దారి లేకుండా పోతుందన్నారు. సర్వే చేయించి కాలువ ఆధునీకరణ పనులకు సహకరించాలని కోరారు. రైతులు కరణం వెంకటేశ్వరరావు, పెంటకోట శ్రీరాములు, కాపుశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



ఒమ్మంగిలో బాధిత కుటుంబానికి చెక్‌ను అందిస్తున్న ముదునూరి కృష్ణంరాజు, నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామంలో పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు, ముదునూరి కృష్ణంరాజు గురువారం పరామర్శించి, రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన మట్ల చంద్ర ఇటీవల 24 గంటల నొప్పికి ఆపరేషన్ చేయించుకోగా, చింతపల్లి దానియేలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స అనంతరం వారిద్దరూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మురళీరాజు వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కొక్కరికీ రూ.ఐదు వేలు చొప్పన రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన బత్తిన రాంబాబు ఇటీవల అకాల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మురళీరాజు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంటా గంగబాబు, ముమ్మిడి వీరబాబు, తోలేటి శేఖర్, దారా నూకరాజు, శైలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కన్జూమర్ గ్రీవెన్సెస్ చైర్మన్ సత్యనారాయణ మూర్తి

తుని రూరల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని **కన్జూమర్** గ్రీవెన్సెస్ ఫోరం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం హంసవరం సెక్షన్ కార్యాలయ ప్రాంగణం (తుని వీరవరపేట)లో కన్యూమర్ గ్రీవెన్సెస్ ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలువురు రైతులు, గృహ వినియోగదారులు పాల్గొని సీజీఆర్ఎఫ్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. కొన్ని సమస్యలపై సంబంధిత ఏఈలతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మరికొన్ని ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని చైర్మన్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఫోరం సభ్యులు సుబ్బారావు, ట్రాన్స్‌కో ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

దర్బార్‌కు ఫిర్యాదుల వెల్లువ



తుని ప్రజాదర్బార్‌లో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని: ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. గురువారం పట్టణంలోని కొండవారిపేటలో అధికారుల సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఉన్న రైల్వే అండర్ పాస్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు ఎమ్మెల్యే దివ్య దృష్టికి తీసుకువచ్చారు. కరెంట్ మీటర్లతో సమస్యలు తలెత్తుతున్నాయని, 300 యూనిట్లు దాటి విద్యుత్ వాడిన కారణంగా తల్లికి వందనం పథకం రాలేదని మహిళలు వివరించారు. ఇళ్ల స్థలాలు, పారిశుధ్యం తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థుల విజయకేతనం



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోకవరం: యూత్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో గోవాలో నిర్వహించిన ఆల్ ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్–2025లో వివిధ క్రీడల్లో మండలంలోని కొత్తపల్లికి చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల పీఈటీ రవి గురువారం మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అండర్–14 విభాగంలో ఆర్ దుర్గాప్రసాద్ తన క్రీడాప్రతిభను కనబరిచి సింగిల్స్‌లో ప్రథమ స్థానం, డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. అండర్ –17 సింగిల్స్ విభాగంలో ఆర్ రాజ్‌కుమార్ ప్రథమ స్థానం, అండర్ –19 విభాగంలో ఆర్ ప్రవీణ్ సెకెండ్ స్థానం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను సర్టిఫికెట్, మెడల్స్‌తో సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యన్నారాయణ, కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు.

సూపర్ సిక్స్‌తో నిలువునా మోసం



పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్న పార్టీ నాయకులు

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం
- జగన్ అంటే నమ్మకం..బాబు అంటే మోసం పుస్తక ఆవిష్కరణ

అన్నవరం: మూడూ పార్టీల కలయికతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది కాలంలోనే ప్రజలను పూర్తిగా మోసం చేశారని శంఖవరం మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ నరాల శ్రీను విమర్శించారు. ప్రత్తిపాడు వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు గురువారం అన్నవరంలో వైఎస్ఆర్ సీపీ ముద్రించిన జగన్ అంటే నమ్మకం..బాబు అంటే మోసం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల కన్నా ఎక్కువ అమలు చేస్తాం, సూపర్ సిక్స్ అమలు చేస్తాం అని ప్రజలను మోసం చేసి, ఏమీ అమలు చేయకుండానే సూపర్ సిక్స్ అమలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని ఆ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అడపా సోమేశ్, ప్రత్తిపాడు నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు సరమర్ల మధుబాబు, వాణిజ్యవిభాగం అధ్యక్షుడు గణేశుల బాబ్జీ, నాయకులు హరిబాబు, మాణిక్యం, రాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అంతర్గత బదిలీలు

- సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల విభాగాల మార్పులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో అంతర్గత బదిలీలు జరిగాయి. ఇటీవలి బదీలల్లో భాగంగా అన్నవరం నుంచి కొందరు ఉద్యోగులు ఇతర దేవస్థానాలకు బదిలీ కాగా, వారి స్థానంలో ఇతర దేవస్థానాల నుంచి కొందరు బదిలీలపై వచ్చారు. ఈ క్రమంలో కొందరి విభాగాలను మారుస్తూ ఈఓ వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ తాడి గుర్రాజుకు సెంట్రల్ స్టోర్స్, కోరుకొండ దేవస్థానం, శానిటేషన్ విభాగాల బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ కేవీబీ సుబ్రహ్మణ్యాన్ని స్వామివారి ఆలయ విభాగం నుంచి వ్రతాల విభాగానికి మార్చారు. ఈఓ పేషీ, రిసెప్షన్ విభాగాలను యధాతథంగా ఉంచారు. సూపరింటెండెంట్ యనమల అప్పారావుకు అకౌంట్స్, సన్నిధి, ఆడిట్ విభాగాలతో బాటు స్వామివారి ఆలయం, ఆర్‌టీఐ విభాగాలను అప్పగించారు. ఆలయ సూపరింటెండెంట్ కె.సతీష్‌ను అన్నదానం విభాగానికి మార్చారు. అన్నదానం సూపరింటెండెంట్ జె. రామకృష్ణను ఆలయ సూపరింటెండెంట్ నియమించారు. అలాగే బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు ఎంఎస్ ప్రకాశరావును ఈఓ పేషీ క్లర్క్‌గా, కేఎస్ శ్రీనివాస్‌ను కోరుకొండ దేవస్థానం క్లర్క్‌గా నియమించారు. అలాగే జూనియర్ అసిస్టెంట్లు టీఎస్ రాంజీని పీఆర్వో ఆఫీసు, బీ ఫోర్ క్లర్క్‌గా, జె.దండేశ్వరరావును సీ సెక్షన్ క్లర్క్‌గా, వనపర్తి రమేష్‌ను డొనేషన్ షాప్స్, రెవెన్యూ కలెక్షన్, డీసీబీ క్లర్క్‌గా, కేహెచ్ ప్రసాద్‌ను ఎలక్ట్రికల్ సెక్షన్ క్లర్క్‌గా, వి.ఉమాశంకర్‌ను కంప్యూటర్ వర్క్ క్లర్క్‌గా, రావి సురేష్‌ను ఏ–1 క్లర్క్‌గా, బి.ఏడుకొండలును న్యూ సీసీ సత్రం క్లర్క్‌గా, జి.కృష్ణను సన్నిధి కౌంటర్ల క్లర్క్‌గా నియమించారు.



శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం

మాజీ మంత్రి తోట పరామర్శలు



గోకవరంలో బుజ్జి రాజును పరామర్శిస్తున్న తోట నరసింహం, రాంజీలు

గోకవరం: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి, జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీ రాంజీ గురువారం పరామర్శించారు. సంజీవయ్యనగర్‌కు చెందిన పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బుజ్జిరాజును, గోకవరం టౌన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ మురళీ వివిధ ఆరోగ్య సమస్యలతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మాతృవియోగం చెందిన డ్రైవర్స్ కాలనీకి చెందిన రాయి జోగారావు, కామరాజుపేటకు చెందిన ఎర్ర రమేష్ ఇరుకుటుంబాల నివాసాలకు నరసింహం, రాంజీలు వెళ్లి పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట మాజీ సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, నరాలశెట్టి నరసయ్య, వైఎస్ఎంపీపీ మడికి మైనర్‌బాబు, గోకవరం టౌన్ కన్వీనర్ బాడితబోయిన చిన్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

జాతీయ టైక్వాండో పోటీలకు ఎంపిక

అన్నవరం: ఈ నెల 9 తేదీ నుంచి 11వ తేదీ వరకూ అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీల్లో అన్నవరం విద్యార్థులు ముగ్గురు విజేతలుగా నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కోచ్ కేవీవీ సత్యనారాయణ గురువారం ఈ విషయం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో టి.కార్తికరాజు, యు.లోకేశ్వరస్వామి, ఎస్.తన్వీర్ సత్యం రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులను స్థానిక శారదా స్కూల్ కరస్పాండెంట్ వర్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీ సత్యదేవ టైక్వాండో క్లబ్ నిర్వాహకులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

కోలుకుంటున్న డయేరియా బాధితులు

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రాఘవపట్నం శివారు దబ్బాద, సత్యవరం, సార్లంక గ్రామాల్లో డయేరియాకు గురైన బాధితులు కోలుకుంటున్నారని సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. నాలుగు రోజులుగా రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న 38 బాధితులకు గాను ఆరోగ్యం కుదటపడిన 31 మందిని గురువారం డిశ్చార్జి చేయగా మరో ఏడుగురుకు చికిత్స కొనసాగుతుందన్నారు. వారు అన్ని విధాలుగా పూర్తిగా కోలుకున్న తరువాతనే డిశ్చార్జి చేస్తామని వైద్యులు వివరించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు.

విద్యార్థుల బైక్ ర్యాలీ

తొండంగి: యోగాంధ్ర దినోత్సవంలో భాగంగా గురువారం పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగాపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీగా చేపట్టారు. యోగా ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం అవ్వాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో యోగాసనాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకలు దివకర్, రాము, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో దరఖాస్తుల స్వీకరణ

జగ్గంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్లకు గాను రెండవ విడత ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జగ్గంపేట ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.ఆర్.ఆర్ కృష్ణన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్ ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 15 సాయంత్రం 5.గంటలలోపు (ఐటీఐ ఏపీ గవర్నమెంట్ ఇన్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్ కాపీని జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలో, ఒరిజనల్ సర్టిఫికెట్స్, సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో సమర్పించి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 94402 62266, 81423 45444 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కృష్ణన్ సూచించారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

తొండంగి: మండలంలోని పలువురు అర్జీదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరిగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దడాల సువర్ణలత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని అభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరరావు, వైస్.ఎంపీపీ నాగం గంగబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు ప్రత్తిపాడులో గురువారం నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను ఆధ్వర్యంలో గాంధీ సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో పార్టీకి పూర్వపు వైభవం వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ప్రజలు సమీప్యంగా రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ సభ్యులు కందిమల్ల సామ్యేలు, షేక్ అంక సాహెబ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

శంఖవరం: పత్తి సాగులో రైతులు మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని జగ్గంపేట, గౌరంపేట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తి సాగు చేసే పొలాన్ని బాగా దుక్కు చేసి కలుపు, దుబ్బులు లేకుండా చూసి వరుస క్రమంలో విత్తనాలు నాటుకోవాలన్నారు. రైతులందరూ ఒకేసారి నాటుకోవడం వల్ల పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చునన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి నాటడం వల్ల గులాబీ రంగు ఉధృతి తగ్గడంతోపాటు నేలలో సేంద్రీయ కార్బన్ శాతం పెరుగుతుందని తెలిపారు. పత్తి పొలం చుట్టూ నాన్ బీటీ పత్తి విత్తనాలు వేయడం ద్వారా చీడ పీడల ఉధృతిని తగ్గించవచ్చని వివరించారు. అనంతరం మామిడి, అరటి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, మౌళి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు క్రాంతి, సువర్ణరాజు, రైతులు పాల్గొన్నారు.